క్లుప్తంగా

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలు, అభరణాలు, పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. సంతానం కోసం దంపతులు గిరికొండ చుట్టూ ప్రదక్షిణాలు చేసి పూజలు చేశారు. ఆలయం ప్రాంగణంలో మొక్కుబడులు ఉన్న మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏం జరుగుతుందో..ఏమో?


పెచ్చులూడిన పిల్లర్లు


పెద్దదోర్నాలలో శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకు

- శిథిలమైన ట్యాంకుతో పొంచి ఉన్న ప్రమాదం
- ప్రాణహాని జరగక ముందే చర్యలు తీసుకోవాలి
- అధికారులను వేడుకుంటున్న ప్రజలు

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకు పూర్తిగా శిథిలమైంది. ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనన్న భయాందోళన మండల ప్రజల్లో నెలకొంది. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్, చికెన్ మార్కెట్ల సముదాయానికి మధ్యలో గతంలో మంచినీటి ట్యాంకు నిర్మించారు. ట్యాంకు పరిసర ప్రాంతం వ్యాపార కూడలి కావడంతో అక్కడికి రోజూ వందల సంఖ్యలో వినియోగదారులు వచ్చి వెళ్తుంటారు. దశాబ్దాల కిందట పెద్దదోర్నాల పట్టణ ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు ట్యాంకును నిర్మించారు. అది కాలక్రమేణా శిథిలావస్థకు చేరి కొంతకాలంగా ట్యాంకుకు సంబంధించి వివిధ ప్రదేశాల్లో పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయట పడ్డాయి. అధికారులు కొన్నేళ్లుగా దీన్ని వినియోగించడం లేదు. ట్యాంకుకు సంబంధించిన పిల్లర్లు పూర్తిగా బలహీనం కావడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వాటర్ ట్యాంకును పరిశీలించిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు వినియోగానికి పనికిరాదని నిర్ధారించారు. ట్యాంకు నిర్మించిన ప్రాంతంలో ఓ వైపు కూరగాయల దుకాణాలు, మరో వైపు మటన్, చికెన్ షాపులను స్థానికులు దీర్ఘకాలికంగా నిర్వహించుకుంటున్నారు. కొన్ని రోజుల నుంచి ట్యాంకుకు సంబంధించిన కాంక్రీటు పెచ్చులు పైనుంచి ఊడి పడుతుండటంతో ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన దుకాణదారుల్లో నెలకొంది. రోజులు గడుస్తున్న కొద్దీ నిరుపయోగంగా ఉన్న ట్యాంకును తొలగించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోవటం స్థానికుల్లో విమర్శలకు తావిస్తోంది. మార్కెట్‌లోని వ్యాపారులు భయం, భయంగానే ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నారు. క్రమేపి ట్యాంకు పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఏక్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

భయం వెంటాడుతోంది



ఎప్పుడో నిర్మించిన ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది, పిల్లర్లకు సంబంధించిన ఇనుప చువ్వలు సైతం బయట పడ్డాయి. పై నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని పాతది పడగొట్టి కొత్త ట్యాంకు నిర్మించాలి.
– యాసిన్, చికెన్ వ్యాపారి, పెద్దదోర్నాల

మూఢనమ్మకాలు విడనాడాలి


విద్యార్థితో మ్యాజిక్ చేయిస్తున్న రామన్

దర్శి (కురిచేడు): పిల్లలు మూఢనమ్మకాలను విడనాడితే సైన్స్ అభివృద్ధి చేయవచ్చని ప్రముఖ మ్యూజీషియన్ బి.రామన్ అన్నారు. దర్శిలోని సుందరయ్య భవన్‌లో బాలోత్సవం రెండో రోజు శిక్షణ తరగతులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు, మతం, కులం, వ్యక్తిగత ప్రయోజనాలు వీడితే దేశం అభివృద్ధి చెందుతుందని, దానికోసం రాష్ట్ర వ్యాప్తంగా చిల్డ్రన్స్ క్లబ్ బాలోత్సవాలు నిర్వహించి పిల్లల్లో వినోదం, వికాసం పెంచుతున్నట్లు చెప్పారు. మండుతున్న కర్పూరం నోట్లో వేసుకోవడం, తాడుతో విన్యాసాలు, గణిత విన్యాసాలు నేర్పించినట్లు పేర్కొన్నారు. బాల బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొని అనేక అంశాలపై శిక్షణ తీసుకున్నారు. పాటల శిక్షణను ఉప్పు మోహన్‌రావు ఇవ్వగా సమన్వయకర్తలుగా కేవీ పిచ్చయ్య, ఈమని నాగేశ్వరరావు, చిట్లా ఆదినారాయణ వ్యవహరించారు.

తక్కువ ఎరువులతో అధిక దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

దొనకొండ: తక్కువ ఎరువులతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని కొచ్చెర్లకోట, పుల్లాయపల్లి గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమాన్ని కేవీకే సమన్వయకర్త డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో కొచ్చెర్లకోట, పుల్లాయపల్లి గ్రామాలకు అనువైన పంటల రకాలు, వాటి గుణగణాలు వివరించారు. రైతులు తమ పొలాల్లో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలన్నారు. రైతులు స్వయంగా తమ సమస్యలను నేరుగా వ్యవసాయాధికారులకు వివరించి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఏఓ మాట్లాడుతూ రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపారు. వివిధ రకాల పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 189 అర్జీలు

యర్రగొండపాలెం: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలంలో 189 మంది అర్జీలు దాఖలు చేశారని ఎంఈవో పి.ఆంజనేయులు శనివారం తెలిపారు. అర్జీలు దాఖలు చేసుకున్న ఉపాధ్యాయుల్లో ఎస్జీటీలు 98 మంది, స్కూల్ అసిస్టెంట్‌లు 82 మంది, పీఎస్ హెడ్మాస్టర్లు 9 మంది ఉన్నారని, వీరిలో 98 మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉందని ఆయన తెలిపారు. ప్రాథమిక హెడ్మాస్టర్లు 9 మందిలో 8 మంది ఇతర మండలాలకు బదిలీపై వెళ్లారని, గ్రేడ్ 2 హెడ్మాస్టర్లు ఐదుగురు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లి ఇతర మండలాల నుంచి ఐదుగురు హెడ్మాస్టర్లు పదోన్నతిపై బాధ్యతలు స్వీకరించారని ఆయన తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు


ఊరేగుతున్న బొల్లావులు

ఘనంగా పోలేరమ్మ తల్లి కొలుపులు

తాళ్లూరు: మండలంలోని వెలుగువారిపాలెంలో రెండు రోజులుగా శ్రీ పోలేరమ్మ నాంచారమ్మ తల్లి కొలుపులు భక్తిశ్రద్ధలతో జరిగాయి. తొలుత అమ్మవార్లను అలంకరించి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలు తమ ఆచారంగా భావించి అమ్మవార్ల విగ్రహాలను, బొల్లావులను తలపై పెట్టుకొని ఊరేగించారు.


నాంచారమ్మ అమ్మవారు

భావితరాలకు మార్గదర్శకులు ఉపాధ్యాయులే


పూర్ణచంద్రరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: భావితరాలకు మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజారహంతుల్లా పేర్కొన్నారు. మండలంలోని పడమర వీరాయపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పచ్చా పూర్ణచంద్రరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం గణిత ఉపాధ్యాయుడు వి.రామచంద్రరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఖాజా రహంతుల్లా మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసి విద్యార్థుల అభివృద్ధి కోసం 42 సంవత్సరాలు కృషి చేసిన పూర్ణచంద్రరావు జీవితం సాఫల్యమైందని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పూర్ణచంద్రరావు శేష జీవితం ఆనందంగా గడవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం సన్మాన పత్రం అందజేశారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు, గ్రామస్తులు, బంధువులు పూర్ణచంద్రరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ వస్త్రాంనాయక్, దొనకొండ ఎంఈఓ షేక్ అమీర్, ఏపీటీఎఫ్ దర్శి డివిజన్ కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, దర్శి నియోజకవర్గ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఎస్వీ సుబ్బయ్య, లయన్స్ క్లబ్ కురిచేడు అధ్యక్షుడు ఎస్.రమణారావు, నరసరావుపేట వైద్యులు ఓగూరి కోటయ్య పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు రాజశేఖర్


రాజశేఖర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

దర్శి (కురిచేడు): గోళ్లపాటి రాజశేఖర్ ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి పేర్కొన్నారు. దర్శి మండలం అన్నవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోళ్లపాటి రాజశేఖర్ ఉద్యోగ విరమణ సభ శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ 34 ఏళ్లు ఉపాధ్యాయుడిగా వివిధ పాఠశాలల్లో పని చేసి పాఠశాలల అభివృద్ధికి రాజశేఖర్ కృషి చేశారని కొనియాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని, ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. విద్యారంగంలో విశేష సేవలు అందించారని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌మస్తాన్ అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారని, ఫెడరేషన్‌లో వివిధ బాధ్యతలు సమర్థంగా నిర్వహించారని తెలిపారు. అన్నవరం పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి పేర్కొన్నారు. అనంతరం రాజశేఖర్ దంపతులను ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మాజీ ఎంపీపీ పూసల సంజీవయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతవరం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, రావులపల్లి గురుప్రసాద్, పిల్లి రమణారెడ్డి, డి.వెంకటరెడ్డి, తూము శ్రీనివాసరావు, మీనిగ శ్రీను, జి.రంగస్వామి, గోగుల కోటేశ్వరరావు, జేవీవీ కీర్తి, బీజేపీ నాయకులు శ్రీనివాసరావు, కపురం శ్రీనివాసరెడ్డి, గోళ్లపాటి చంద్రమోహన్, విజయకుమార్, నేరెళ్ల జాన్ పాల్గొన్నారు.

చెంచు గిరిజనుల శ్రమదానం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలోని చెంచు గిరిజనులు కొన్ని రోజులుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తమ కాలనీలో నీటి సమస్య ఉందని, నీటి కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పంచాయతీ అధికారులు ఆదేశాల మేరకు కాలనీకి వచ్చిన పంచాయతీ సిబ్బంది పగిలి పోయిన పైపును గుర్తించేందుకు సగం గుంతను మాత్రం తవ్వి వెళ్లిపోయారని గిరిజనులు వాపోతున్నారు. దీంతో మిగిలిన గుంతను తామే తవ్వుకుని పగిలి పోయిన పైపునకు జాయింట్ వేసే పనిలో పడ్డారు. మూడు రోజులుగా పగిలిన పైపు నుంచి వచ్చే నీటినే పట్టుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


గుంతను తవ్వుకుంటున్న గిరిజనులు

టీబీ ముక్త పంచాయతీలుగా బొద్దికూరపాడు, లక్కవరం


జేసీ గోపాలకృష్ణ నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శ్యాంసన్

తాళ్లూరు: క్షయ వ్యాధి రహిత పంచాయతీలుగా మండలంలోని బొద్దికూరపాడు, లక్కవరం గ్రామాలు ఎంపికయ్యాయి. బొద్దికూరపాడు, లక్కవరం సర్పంచ్‌లు మందా శ్యాంసన్, నన్నం వరలక్ష్మి వెంకటేశ్వర్లు జిల్లాలో నిర్వహించిన టీబీ ముక్త భారత్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చేతుల మీదగా అవార్డులు అందుకున్నారు. సర్పంచ్‌లను మండల పార్టీ కన్వీనర్ తూము సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కోటేష్, బాలకోటయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. సర్పంచ్‌లు మందా శ్యాంసన్, నన్నం వరలక్ష్మి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాలతో పాటు గ్రామ ప్రజలకు మేలు చేసే అన్ని మంచి పనులను విజయవంతంగా చేసి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

యోగాతో మేధోశక్తి పెంచుకోవచ్చు


దొనకొండ: యోగా చేస్తున్న ఉద్యోగులు

దొనకొండ: యోగాతో మేధోశక్తి పెంపొందించుకోవచ్చని మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 4 రోజుల నుంచి యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు యోగాలో పాల్గొన్నారు. రోజుకు కొంత సమయం యోగాకు కేటాయించాలని ఎంఈఓ సూచించారు.

పత్తి పంటను పరిశీలించిన ఏఓ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాలలో వేసవిలో సాగు చేసిన పత్తి పంటను మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటను పరిశీలించిన ఆయన పత్తి పంటలో మెగ్నీషియం లోపం ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. లోప నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రాజేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

రేషన్ పంపిణీకి సన్నద్ధం


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కురిచేడు: రేషన్ షాపుల్లో ఆదివారం నుంచి రేషన్ సరుకుల పంపిణీకి సన్నద్ధం చేసినట్లు తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. మండలంలోని వెంగాయపాలెం రేషన్ షాపును ఆమె శనివారం తనిఖీ చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. దానికనుగుణంగా ఆదివారం వెంగాయపాలెం రేషన్ షాపును ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

తాళ్లూరు: రేషన్ సరుకులు ఆదివారం నుంచి డీలర్లు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు దుకాణాల వద్ద రేషన్ సరుకులు డీలర్లు అందిస్తారని, వృద్ధులు, వికలాంగులకు మధ్యాహ్న సమయంలో వారి ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

మండల కేంద్రం తాళ్లూరులో ఆదివారం ఉదయం రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.